# కన్న కడుపు

అల్లుడు ఇలా చెడిపోతాడని శేషగిరమ్మగారను కోలేదు. చదువుకొన్నవాడు. చక్కనివాడు. ఇంత మాత్రమే అయితే తను శివరామయ్యకు కూతుర్నిచ్చేదికాదు. శివ రామయ్యకంటేమంచివాళ్ళు ఎంతమంది యిదివరకు సంబంధా లకు రాలేదు? వరమ్మ వాళ్ళెవళ్ళనీ వొప్పలేదు. కూతురు నెత్తి మీద బలవంతాన ఒక తద్దినం తెచ్చిపెట్టటం శేషగిరమ్మ ఏనాడూ చెయ్యలేదు ఒక్కగా నొక్క కూతురు. లేక లేక పుట్టింది. కట్టుకుపోయినంత ఆస్తి. ఇంత కలవాణ్ని చూసి యివ్వాలిసినఅవసరం ఏమాత్రంలేదు.అందుకే శివరామయ్యకు చెప్పుకో దగ్గంత ఆస్తి లేకపోయినా వరమ్మనిచ్చి పెళ్ళి జేసింది.

వరమ్మకు పెళ్ళి కాబొయ్యే వరకూ భర్త సంగతి తెలీదు. ఒకవేళ తెలిసినా అతని రూపానికి భ్రమించి, అతని స్వభావాలను సహించి భరించేదేమో మరి? భర్త తనను మోసగించాడని ఆమె 'ఫీ'లయింది. తననూ, తన కూతుర్నీ మోసగించాడని శేషగిరమ్మ అనుకొంది. పనిగట్టుకొని శివ రామయ్య వాళ్ళను మోసగించిందేమీలేదు. మొదటినుంచీ అతని స్వభావమే అంత. అయితే శివరామయ్య మీది మోహపుకాంతిలో వరమ్మకు అతని గత జీవితంతో అవసరం లేకపోయింది. కూతురు దప్ప మరొక ప్రపంచమే వున్నట్లు వొప్పుకోని శేషగిరమ్మకు; కూతురుకు కనిపించని తప్పులు కని పించటానికి ఏల్లేదు మరి.

శివరామయ్య పెళ్ళయిన కొంతకాలానికి భార్యనుతనింటికి తెచ్చుకొన్నాడు. అల్లుడూ కూతురూ 'సుఖంగా' వుంటున్నారని విని శేషగిరమ్మ సంతోషించింది. నిజానికి ఆమె సంతోషించవలసింది యింత కంటే ఏముంటుంది గనక.

వరమ్మ రాసిన వుత్తరం చదివాక శేషగిరమ్మ కల విచ్చిపోయింది. తనింతకాలం అనుకొంటున్నది యదార్థాన్ని కాక, దానితాలూకు ఛాయలను మాత్రమేనని ఆమెకి వుత్తరం తెలియచేసింది. కూతురు, అల్లుడు ఎంత సుఖంగా కాపరంచేస్తున్నదీ నిదర్శనానికి, యీ వుత్తరం చాలు.

పాపం! శేషగిరమ్మగారి నడుం విరిగినంతపనయింది. చిన్నప్పటినించీ జలుబుగూడా చెయ్యకుండా (!) ముత్యమల్లే పెరిగింది. ఒక్కసారైనా యింత శొంఠిగంధంరాయించుకొన్న పాపాన పోలేదు. బిడ్డ ఈ సుఖ రోగాలతో ఎంత బాధపడుతోందో? శేషగిరమ్మ కళ్ళ వెంబడి నీళ్ళొచ్చినై. శివరామయ్యను చెడబడా తిట్టింది. తిట్టినందువల్ల ప్రయోజనం ఏమీ వుండదు. తిట్టానన్నే తృప్తి తప్పితే! శివరామయ్యను యింకెన్ని తిట్టినా వరమ్మకు పట్టుకొన్న జబ్బు లేమీ పోవు. నయంచేస్తే పోతై. మూడు పచ్చ కాగితాలు రొంటెన దోపుకొని కూతురు దగ్గిరికి బయలు దేరింది శేషగిరమ్మ.

ఆమె వొచ్చేటప్పటికి శివరామయ్య యింటో లేడు. ఎవరో ముసలమ్మ శేషగిరమ్మను పలకరించింది. ఆమెకు యివన్నీ పట్టలేదు. కూతురు ఎట్లావుంది? ఏ స్థితిలో ??

తల్లి గదిలో కొచ్చేటప్పటికి వరమ్మ వొంటినిండా శాలువాకప్పుకొని కళ్ళుమూసుకొని మూలుగుతూ వుంది.

కళ్ళల్లో నుండి నీళ్ళు బుగ్గలుమీదుగా జారిపోతున్నయ్. పచ్చగా వుండే దాని ముఖంనల్లకప్పేసింది. మొఖంనిండా మచ్చలు, కురుపులు.

"వరూ"

వరమ్మ తల్లిని చూసి బావురుమన్నది. శేషగిరమ్మ కూతుర్ని లేవదీసి కూచోబెట్టింది. వరమ్మ వొంటిమీద గుడ్డ లేదు. చీముకారుతున్న పుళ్ళు, మచ్చలు, వాటికి పూసిన పసరు, కూతుర్ని ఆ స్థితిలో చూసిన తరవాత శేషగిరమ్మ ప్రాణం దిమ్మరపోయింది.

వరమ్మ తల్లిని కావిలించుకొని ఏడ్చింది. శేషగిరమ్మ ప్రాణం అన్నుబట్టింది. గుండె దిగజారింది.

"ఛీ వూరుకో అమ్మా! నాలుగు రోజుల్లో నయమయి పోతాయి, నేను నయం చేస్తాగా. ఇదుగో మూడొందలు తెచ్చాను. కావాలంటే యింకా తెప్పిస్తాను. నీకంటే నాకిం కెవరున్నారే తల్లీ" అన్నది శేషగిరమ్మ.

"బాగుచేయిస్తావు. ఏంలాభం బాగుచేయించి? కాస్త ఆరోగ్యం పుంజుకునేటప్పటికి మళ్ళీజబ్బులు...లాభంలేదు. నేను బతకను"—

శేషగిరమ్మ కూతురుకు ధైర్యంచెప్పి అనునయించి, లాలించి అడిగింది సంగతేమిటని.

"పొరబాటుపడ్డాను. సున్నితంగా, వుంటాడని భ్రమి సాను. కానీ...వొట్టి పశువు. సిగ్గువిడిచి చెబుతున్నాను ఒక్కొరోజు కాళ్ళకు చుట్టుకొని ఏడ్చేదాన్ని—కొడతాడు

తంతాడు. ఆఖరికి నా ఏడుపు చూడలేక మేనకను వుంచుకొన్నాడు".

"మేనక ఎవరు?"

"భోగంది."

శేషగిరమ్మ నిట్టూర్పు విడిచింది. అంతకంటే అప్పుడు ఆమె చేయగలిగిందేమీ లేదు.

"అన్నీ నేను నయం చేస్తాను తల్లీ! వారం రోజుల్లో అన్నీ పోతయ్!"

"ఏం లాభం? ఆ సంతోషం ఎంత కాల ముంటుంది? నెల తిరక్కుండానే మళ్ళీ నాకు అంటిస్తాడు—.నేను కోలుకొనే దాకా ఆయన్ని దానింటికి పోనివ్వొకమ్మా—ఈ లోపుగా ఆయనగారిక్కూడా మందులిప్పించు. నేను సరిగ్గా వుండాలంటే ఆయనా వుండాలిగా—"

శేషగిరమ్మ యింతవరకూ అల్లుడితో సరిగ్గా మాట్లాడి ఎరుగదు. ఈ రోజున యీసంగతి అతనితో ఏమని చెబుతుంది? ఎట్లా చెబుతుంది? తనకూతురుకోసం సిగ్గు, భిడియము, అభిమానమూ చంపుకోవాలి. లేకపోతే కూతుర్నే చేజేతులా చంపుకొన్నట్లవుతుంది. వరమ్మ పసికాయ! శివరామయ్య బలంగా, గట్టిగా, వుక్కుమనిషికిమల్లే వుంటాడు. వరమ్మకు ఎటుగూడి తను నయంచేస్తుంది. అయితే దాని ఫలితం శివరామయ్యగూడా నయంచేసుకొన్నప్పుడే! అంతకంటే ముందు ఆ అబ్బాయి, ఆ భోగం ముండయింటికి పోకుండా చూడాలి. ఎంత చికిత్స చేసుకొంటున్నా, రోజురోజూ, రోగాల్ని తెచ్చుకొంటుంటే ఎప్పటికి నయమయేటట్టు? కాక

పోతే... శివరామయ్యా చచ్చినా ఫర్వాలేదు. వరూ బాగుంటే సరి.

గడియారం రెండు గంటలు కొట్టేందాకా ఆమె ఆ రాత్రి ఆలోచిస్తూనేవుంది. పూరికే ఆలోచించి ఏంలాభం? ఏదో విధంగా సరి చేసుకోవాలి పరిస్థితులు. తలుపు వేసి పడుకోబోందామని లేచింది. మేనకయింటినుండి ఎప్పుడు వొచ్చాడో తెలీదు; శివరామయ్యా మంచంమీద పడుకొని వున్నాడు. ఈ వెధవ మూలంగా తన కూతురుకు ఎంత గతి పట్టింది! ఎర్ర కలువలె వుండే వరమ్మ నల్లబడి, చిక్కి, అసహ్యంగా తయారైంది. అందంగా, నున్నగా మెరుస్తోవుండే దాని వొంటికి, సుఖ రోగాల మచ్చలు, పుళ్లు, చీము, రసి; దానికి కట్లు. ఈ రోగంతో ఎంత బాధపడకపోతే "అమ్మా! నేను బతకను–ఆయన నన్ను బతకనియ్యడు" అంటుంది వరమ్మ!

శేషగిరమ్మ అట్లా అనుకొంటో, దీపం తగ్గించింది; మినుకు మినుకుమనేట్టు, చీకటి దీపాన్ని మింగేట్టు. ఆమె వొణుకు, వుద్వేగం, వొంటిలో ఆవేశం; చీకటికి చెదురుడు. అట్లా చీకటిని తొలగదీసుకొంటూ వెచ్చగా నడిచింది...

శేషగిరమ్మ వుదయం ఎండకు, బద్ధకంగా, మత్తుగా, లేచింది; అందంగా కలలుగంటున్న కళ్ళమీదకు వాలిన వెంట్రుకలను, సున్నితంగా పైకి తోసుకొంటో, నవ్వుతో శివరామయ్యాగూడా బలువుగా లేచాడు. ఆ యిద్దరూ నవ్వుకొన్నారు ఆ రోజున వొంటరిగా కలుసుకొన్నప్పుడల్లా!

అంతే!! వరమ్మ కోలుకోడానికి పట్టిన నెల రోజుల్లోనూ, శివరామయ్యా, ఎప్పుడూ మళ్లీ మేనక యింటికి వెళ్ళవలసినపని కలగలేదు.